

26న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 26న జరిగే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచీపురం సురేంద్రన్ పిలుపునిచ్చారు. గురువారం చిత్తూరులో ధర్నా కరపత్రాలు వివిధ రకాల కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి విధానాల్లో మార్పు లేదన్నారు. కుక్కతోక వంకరని మరోసారి మోడీ ప్రభుత్వం రుజువు చేసుకుందని విమర్శించారు. ఎన్డీఎలో భాస్వామిగా ఉన్న తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అదే విధానాలను అమలు చేస్తున్నాయని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఈనెల 26వ తేదీన చిత్తూరు కలెక్టరేట్ జరిగే ధర్నాలో జిల్లాలోని అన్ని వర్గాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేతిగుట్లపల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు

నష్టపరిహారం చెల్లించాలి

- 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలి
- వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి- పుంగనూరు

పుంగనూరు మండలం నేతిగుట్లపల్లి ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై గురువారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రాజెక్టును పరిశీలించి నిర్వాసితులతో మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా, దౌర్జన్యంగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రైతులు భూములు ఇవ్వడానికి అంగీకరించారని ప్రభుత్వానికి తప్పుడు సంకేతాలు ఇచ్చి ప్రాజెక్టు 95 శాతం పనులు పూర్తి చేశారని అన్నారు. ఆర్ఆర్ కంపెనీ పేరుతో కాంట్రాక్టు ఉన్నప్పటికీ పిఎల్ఆర్ కంపెనీ రైతులను బెదిరించి ప్రాజెక్టు పనులు పూర్తిచేశారు. అయితే ఇప్పటివరకు ఒక రైతుకు కూడా రూపాయి కూడా నష్టపరిహారం ఇవ్వకుండా మోసం చేయడం దారుణమన్నారు. రైతులు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు స్పష్టంగా రైతు నష్టపరిహారం చెల్లించి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారని అయితే ఆదేశాలను కూడా తుంగలో తొక్కి రైతులను మోసం చేశారని విమర్శించారు. ప్రాజెక్టు కోసం 850 ఎకరాలు 10 గ్రామాల రైతుల భూములు సేకరించి వ్యవసాయానికి అనుగుణంగా ఉన్న భూములను కూడా తీసుకొని రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయే పద్ధతిలో వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు గ్రామాలు పూర్తిగా మునిగిపోయే ప్రమాదం ఉందని, అయినా ఎవరూ లెక్క చేయకుండా ప్రాజెక్టును పూర్తి చేశారని అన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం మొదట నష్టపరిహారం చెల్లించి ప్రత్యామ్నాయ మార్గం చూపించి భూములు తీసుకోవాలని స్పష్టంగా చట్టం చెబుతున్నా ఆ చట్టానికి విరుద్ధంగా గత వైసిపి ప్రభుత్వం అధికారులు వ్యవహరించారని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిర్వాసితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు హామీని అమలు చేసే పద్ధతిలో వ్యవహరించడం లేదన్నారు. రైతులను మోసం చేసిన అధికారులను ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టపరిహారం ఇచ్చేంతవరకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటామని రైతులకు హామీ ఇచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, వ్యకాసం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, రైతులు పులి వెంకటరమణ, కోలాట వెంకటరమణ, రమణమూర్తి, నరేష్, కృష్ణమూర్తి, విజయ, రామాంజనేయులు, సతీష్ పాల్గొన్నారు.


ప్రాజెక్టు బాధిత రైతులతో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

సంక్షేమమేనా..!

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్

చిత్తూరు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని అంబేద్కర్ సంక్షేమశాఖ భవనం అధ్వానంగా తయారైంది.. ఇందులోనూ ముఖ్యంగా వెనుకబడిన తరగతులు మరియు షెడ్యూల్డ్ క్యాస్ట్, షెడ్యూల్ ట్రైబ్ కార్యాలయాలు, ఐసిడిఎస్, వికలాంగుల సంక్షేమం, ఖజానా మొదలైన కార్యాలయాలు ఈభవనంలోనే ఉన్నాయి. ఈభవనంలోకి ప్రవేశించగానే చెత్తాచెదారం స్వాగతం పలుకుతున్నాయి. గార్డెన్ శుభ్రపరచి వారాలు గడుస్తున్నట్లు ఉన్నాయి. కార్యాలయ సిబ్బంది సందర్శకులు గార్డెన్ అపరిశుభ్రంగా ఉండడంతో అక్కడే ఉమ్మి వేయడం వాటర్ బాటిల్లు ఇతర చెత్తాచెదారం ఆ ప్రాంగణంలో పడవేసి ఆ పరిసరాలను అపరిశుభ్రంగా తయారు చేశారు.

ఈ భవనంలో ఎలక్ట్రిక్ బాక్సులు కరెంటు తీగలు గజిబిజి గందరగోళంగా ఉన్నాయి. దీనికి తోడు భవనం పై కప్పు నుండి నీరు కారుతోంది.. వర్షం పడినప్పుడు భవనం ఉరుస్తోంది. ఈ నీరు అస్తవ్యస్తంగా ఉన్న ఎలక్ట్రిక్ బాక్సుల్లో ప్రవేశించినా.. కరెంటు తీగలు ఎక్కడైనా తెగి ఉన్నా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం పొంచి ఉంది. ప్రమాదం జరిగినప్పుడు చూద్దాంలే అన్నట్టు వ్యవహరిస్తున్నారు.. ఇక్కడి అధికారులు.. ప్రమాదం జరిగిన తరువాత తలలు పట్టుకోవడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకుని సంక్షేమ భవనాన్ని క్షేమంగా ఉంచాల్సిన బాధ్యత అక్కడి అధికార, సిబ్బందిపై ఉందని సందర్శకులు అంటున్నారు.


కార్యాలయం ఆవరణలో పేరుకుపోతున్న చెత్తచెదారం


ఓపెన్‌లో ఉన్న విద్యుత్ వైర్లు



అపరిశుభ్రత

పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పం సమీపంలోని అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి పాఠశాల ప్రాంగణంలో పారిశుద్ధ్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందేవిధంగా చూడాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలకు అదనంగా గదులు కావాలని విద్యా కమిటీ చైర్మన్ సుబ్బన్న కలెక్టర్‌ను కోరారు. పాఠశాలకు కావలసిన వసతుల గురించి సంబంధిత అధికారులకు ఆదేశించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం రామకుప్పంలోని మోడల్ కాలనీ వద్ద నూతన సిమెంట్ రోడ్డును పరిశీలించారు. కలెక్టర్ వెంట కడ పీడీ వికాస్ మర్మత్, తహశీల్దార్ బాబు, ఇంజనీరింగ్ అధికారులు, టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, సీతాపతి, వెంకటరమణ, విజయ్ కుమార్‌రెడ్డి, నవీన్ తదితరులు ఉన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు


గంగాధర నెల్లూరు పోలీస్ స్టేషన్లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మణికంఠ చందోలు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు స్టేషన్ నిర్వహణ, పరిశస ప్రాంతాలు, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు స్టేషన్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్ స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సి ఆర్‌పిసి తదితర కేసుల రికార్డ్స్ ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు వాటి పురోగతిపై కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. మహిళా పోలీసులు ఇంటింటికి వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, కొత్త చట్టాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించేలా వారి పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మీ నారాయణ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి- పలమనేరు: విశాఖలో యువతిపై అత్యాచారం, ఆత్మహత్యాయత్నంను నిరసిస్తూ పలమనేరులో ఐద్వా ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక టవర్ క్లాక్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అకృత్యాలపర్వానికి అంతులేకుండా పోతోందని, తాజాగా విశాఖలో మరోఘోరం చోటుచేసుకుందన్నారు. అత్యాచారానికి పాల్పడిన యువకులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం ఉండగా ఉండాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.గంగరాజు, వ్యకాసం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, యుటిఎఫ్ నాయకులు ప్రసన్న, పిసి.బాబు, కెవిపిఎస్ నాయకలు ఈశ్వర్, లోకేష్, వెంకటలక్ష్మీ, నారాయణమ్మ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



ఉపదేశిస్తాం.. కానీ పాటించం..



కార్యాలయం ఎదుట

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్: పరిసరాల శుభ్రత.. వ్యాధుల నియంత్రణపైన ప్రజావైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఉపదేశాలు చేస్తూ ఉంటుంది. కానీ ఆ ఉపదేశాలను వారు మాత్రం పాటించరు. చిత్తూరు ప్రజా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయం చుట్టూ వ్యర్థాలతో అపరిశుభ్రంగా తయారైంది. గడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి కార్యాలయం దారుణంగా తయారైంది. భవనం గోడల పైన పిచ్చి మొక్కలు పెరిగి తీగలు చెట్లు వేలాడుతూ భవనం కనిపిస్తున్నది. వీరి శాఖకు సంబంధించిన హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ప్రజల వద్దకు వెళ్లి ఇల్లు, ఇంటి పరిసరాలు వీధులు శుభ్రంగా ఉంచాలని నీటి తొట్టెను రెండు రోజులకు ఒకసారి శుభ్రపరచాలని చెత్తాచెదారాన్ని దూరంగా పడేయాలని నీరు నిలువ ఉంటే దోమలు పెరిగి రోగాలు ప్రబలుతాయని డెంగీ, మలేరియా వంటి రోగాలు వస్తాయని ఉపదేశాలు చేస్తూ ఉంటారు. అయితే డిఎంఅండ్ హెచ్ఓ కార్యాలయం మాత్రం అపరిశుభ్రంగా అధ్వానంగా దోమలకు ఆవాసంగా వ్యాధులకు నిలయంగా మారింది. ప్రజల ఆరోగ్యంతో పాటు డిఎం అండ్ హెచ్ఓ కార్యాలయ అధికారులు సిబ్బంది కూడా వారి కార్యాలయం చుట్టూ శుభ్రపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



'మున్సిపల్' అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి- పుంగనూరు: మున్సిపాలిటీలో రోజురోజుకు సిబ్బంది అవినీతి పెరిగిపోతున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మున్సిపాలిటీలు సిబ్బంది చేతివాటం వారి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. ప్రముఖంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్, రెవెన్యూ సెక్షన్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగంలో ట్రాక్టర్లకు డీజిల్ పట్టే విషయం, తదితరశాఖలలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం వైసిపి పాలకవర్గం ఉండడంతో చైర్మన్, కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం వైపు రాకపోవడం అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక కూటమి ప్రభుత్వం నాయకులు పైపైన చూసుకోవడం వారి సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించుకోవడం తప్పితే వీటిని గురించి పట్టించుకోవడం లేదు. మున్సిపల్ సిబ్బంది అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పలమనేరు కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ ఫిర్యాదు చేసిన కాపీని కూడా మున్సిపల్ కార్యాలయానికి పంపితే అధికారులు ఫిర్యాదు కాపీని దాచి ఉంచినట్లు సమాచారం. పుంగనూరు మున్సిపాలిటీపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దర్యాప్తు చేపట్టాల్సి ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



నగర సమగ్రాభివృద్ధికి

రూ.350 కోట్ల నిధులివ్వండి

సీఎంను కోరిన ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అన్ని రకాలుగా వెనుకబడిన జిల్లా కేంద్రం చిత్తూరు నగర సమగ్రాభివృద్ధికి రూ.350 కోట్లు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి విన్నవించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని కలిసి చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వారీగా నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. రెండు లక్షల పైగా జనాభా ఉన్న చిత్తూరు నగరం, విలీన పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నగర పరిధిలోని 50 డివిజన్లలో నీటి సరఫరా పైపులైన్ల కోసం రూ.45 కోట్లు, అన్ని డివిజన్ల పరిధిలో అంతర్గత సీసీ, బీటి రోడ్ల నిర్మాణం కోసం రూ.90 కోట్లు, 50 డివిజన్లలో మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ.70 కోట్లు, పార్కుల సుందరీకరణ కోసం రూ.12 కోట్లు, చెరువులను పటిష్టత, అభివృద్ధి చేయడం కోసం రూ.10కోట్లు, ప్రధాన రహదారుల్లో ఫుట్ పాత్‌ల నిర్మాణానికి రూ.10 కోట్లు, ఆధునిక విద్యుత్ దీపాలు, సెంట్రల్ లైటింగ్, హై-మాస్ట్ లైట్ల ఏర్పాటుకు రూ.10 కోట్లు, పాత కూరగాయల మార్కెట్‌ను ఇంటిగ్రేటెడ్ వెజిటేబుల్ మార్కెట్, నాన్ వెజ్ మార్కెట్ గా అభివృద్ధి చేయడానికి రూ.3 కోట్లు, పాత బస్టాండ్ వద్ద ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే వినతిపై స్పందించిన సీఎం మేరకు చిత్తూరు నగర సమగ్ర అభివృద్ధి పనులు, నిధులు కేటాయింపుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ లేఖ రాశారు. చిత్తూరు సమగ్ర అభివృద్ధి కోసం నిధుల కేటాయించాలని ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ముఖ్యమంత్రి గారిని కోరడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


సిఎంను నిధులు కోరుతున్న ఎమ్మెల్యే గురజాల


బాల్యానికి శాపం వివాహం

- ఆగని బాల్యవివాహాలు
- 18 ఏళ్లు నిండకనే గర్భిణులుగా మారుతున్న అమ్మాయిలు
- తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి- వెదురుకుప్పం

ఆడపిల్లలను పెళ్లి చేసి, వదిలించుకోవాలన్న భావన నేటికీ అధిక శాతం ఆడపిల్లల తల్లిదండ్రుల్లో ఉంది. పదో తరగతి పూర్తవ్వగానే పెళ్లిళ్లు చేస్తున్నారు. వేసవికాలంలో అధికంగా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. చదువుకోవల్సిన వయస్సు.. తోటి పిల్లలతో ఆడుపాడుతూ గడపాల్సిన సమయంలో.. పెళ్లి చేసి భర్త.. అత్తమామలు.. కుటుంబ భారాన్ని ఆడపిల్లలపై మోపుతున్నారు.. అమ్మ అవసరమైన వయస్సులో ఉన్న బాలికలు గర్భం దాల్చి తల్లులుగా మారుతున్నారు.. బాల్యవివాహాలు చట్టరిత్యా నేరమని, శిక్ష తప్పదని అధికారులు అవగాహన కల్పిస్తూ.. కౌన్సిలింగ్ ఇస్తున్నా.. పల్లెప్రాంతాల్లో మాత్రం బాల్యవిహాలు అక్కడక్కడ నేటికీ జరుగుతూనే ఉన్నాయి.. కొన్ని వివాహాలకు కుటుంబ పరిస్థితులు కారణం కాగా.. కొన్ని ప్రేమపెళ్లిళ్ల కారణంగా జరుగుతున్నాయి.. అధికారులు సైతం పల్లెప్రాంతాల్లో సరైన అవగాహన కల్పించడంలో, బాల్యవివాహాలను నిర్మూలించడంలో విఫలమయ్యారని కొందరు ఆరోపిస్తున్నారు.. చిన్న వయస్సులోనే బాలికలు గర్భం దాల్చడం మలన అనారోగ్య సమస్యలే కాకుండా వారి ప్రాణాలు సైతం ప్రమాదంలో పడుతున్నాయి.

18 ఏళ్లలోపు వారు 30 మంది



గర్భిణులు

గంగాధర నెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఎస్ఆర్ పురం, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలు ఉన్నాయి. ఈ మండలాలలో 30 మంది అమ్మాయిలు 18 సంవత్సరాలు నిండకముందే గర్భవతులుగా మారినట్లు కార్వేటినగరం ఐసిడిఎస్ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో వెదురుకుప్పంలో 13 మంది, ఎస్ఆర్ పురంలో 9 మంది, కార్వేటి నగరంలో 8 మంది అమ్మాయిలకు బాల్యవివాహాలు జరగడమే కాకుండా చిన్నవయస్సులోనే తల్లులుగా మారుతున్నారని ఐసిడిఎస్ అధికారులు గుర్తించారు. దీన్ని బట్టి చూస్తే ఈ మండలాలలో బాల్యవివాహాలు ఆగడం లేదని స్పష్టమవుతోంది..

చిన్న వయస్సులో ఎందుకిలా...

బాల్యవివాహాలు చట్టరిత్యా నేరమని, శిక్షలు తప్పవని క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అవగాహన కల్పించాలని, బాల్య వివాహాలు చేసిన బాధ్యులపై పోలీసులు ఇరువైపుల వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేయాలని కొందరు గ్రామస్తులు కోరుతున్నారు. బాల్యవివాహాలు జరగడానికి అధికార యంత్రాంగం ఉదాసీనత కూడా ఓ కారణమనే చెప్పాలి. పల్లెప్రాంతాల్లో అవగాహన లోపం కుటుంబ పరిస్థితులు, ప్రేమ వివాహాలు మరొక కారణంగా జరుగుతుంటే అధికశాతం బంధుప్రీతి వలన జరుగుతున్నాయి. ప్రతి గ్రామపంచాయతీలో అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఉంటున్నారు. పోలీస్, రెవెన్యూ శాఖలకు సంబంధించి సమాచారం అందించే వాళ్లు ఉన్నారు. అయినా వీరికి వివాహాలను అరికట్టడం పెను సవాలుగా మారుతుంది. నియోజకవర్గంలో 222 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి ఈ గ్రామాలలో విస్తృతంగా అవగాహన సదస్సులు పెట్టాలి. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను ప్రతి బాలిక తల్లిదండ్రులకు వివరించాలి. వాటి వల్ల కలిగే అనర్థాలను వారికి తెలియజెప్పాలి. ఆరోగ్య శాఖతోపాటు ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీస్ శాఖలు సంయుక్తంగా చైతన్య సదస్సులను నిర్వహించాలి అప్పుడే ఆడపిల్లలను కాపాడుకోగలం..



బాలవివాహాలు జరగకుండా చర్యలు చేపడతాం..

- పద్మ సునంద ఐసిడిఎస్ కార్వేటినగరం ప్రాజెక్టు అధికారిని



బాల్య వివాహాలపై గ్రామాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఇంకా అక్కడక్కడా జరుగుతూనే ఉన్నాయి. ఇంకా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు పరిధిలో 18 ఏళ్లలోపు ఉన్న గర్భిణులు 30మందిని గుర్తించాం. వీరికి ప్రత్యేక వైద్యం అందించేలా స్థానిక ఆశాలకు ఆదేశాలిచ్చాం. అక్కడక్కడ ప్రేమ వివాహాలు జరుగుతున్నాయి. మా సిబ్బందికి తగు సలహాలను ఇచ్చాం. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు చేపడతాం.

అనర్థాలపై అవగాహన కల్పించాలి...

- డాక్టర్ సురేఖ, పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారిణి



చిన్నవయస్సులోనే ఆడపిల్లలు గర్భం దాల్చడం వలన వారు అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవల్సి ఉంటుంది. ప్రసవ సమయంలో తల్లీబిడ్డ సురక్షితంగా ఉంటారా.. అన్నది కూడా అనుమానమే.. కొందరు చనిపోయే ప్రమాదమూ ఉంది.. బాలవివాహాల వలన ఆడపిల్లలు రక్తహీనత, బలహీనతతో పాటు జీవిత కాలం కొన్ని అనారోగ్య సమస్యలు తప్పవు.. ఆడపిల్లలకు 21 సంవత్సరాలు పూర్తి అయ్యేవరకు వివాహం చేయకూడదు. ఆ వయస్సు వస్తేనే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారు. ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు వారు తయారుగా ఉంటారు..

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

నాణ్యత లోపిస్తే కఠినచర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి వార్తకు స్పందన



ప్రజాశక్తి- గంగవరం: పలమనేరు – శంకర్రాయిల్ పేట రహదారి, పలమనేరు – అప్పినపల్లి రహదారి పరిస్థితి గురించి ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన గుంతలమయం.. గుండెల్లో భయం అన్న శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. రోడ్ల మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి స్పందించి వెంటనే ఈ రహదారులు శాశ్వత మరమ్మతులు ప్రారంభించాలని అధికారులను హెచ్చరించడంతో గురువారం పనులు ప్రారంభమయ్యాయి. గుంతల పూడ్చివేడయమే కాక శాశ్వత రోడ్డును నిర్మిస్తున్నారు. ముఖ్యంగా శంకరయల్ పేట గ్రామం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల రోడ్డు పక్కపక్కనే ఉండడంతో మొదటగా శంకరయ్య పేట గ్రామం నుండి రోడ్డుపనులను ప్రారంభించారు. రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో గ్రామస్తులు వాహనదారులు పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీలకు

సోమల విద్యార్థులు



ప్రజాశక్తి- సోమల: రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు హరినాథ్ తెలిపారు. ఈనెల 21వ తేదీన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెత్త కుప్పంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో త్రో బాల్ అండర్ -14 ఎంపిక పోటీలు స్కూల్ గేమ్స్ సెక్రటరీ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారని, ఈ పోటీలలో అండర్ -14 త్రో బాల్ పోటీ విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సోమల విద్యార్థులు అయ్యప్ప చరణ్ తేజ్ 9వ తరగతి, అక్షర 8వ తరగతి విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికైన ఇరువురు విద్యార్థులు నవంబర్ 28, 29 తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పిడి కరుణానిధి తెలిపారు. వీరి ఎంపిక పట్ల ఉపాధ్యాయ బృందం, గామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

22న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 22వ తేదీన సాఫ్ట్ బాల్ అండర్ -14 బాలబాలికల రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంత వాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68వ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ అండర్ -14 బాలబాలికల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలను జిల్లా కలెక్టర్ ప్రారంభిస్తారని తెలియజేశారు. మూడు రోజులపాటు జరగనున్న పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొంటారని ఇందుకోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసామని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అందజేస్తారని తెలిపారు.

సిమెంట్ రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-శాంతిపురం:



మండలంలోని మొరసనపల్లె, రాళ్లబూదుగూరు, కర్లగట్ట గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులు రూ.5.33 కోట్లతో జరుగుతున్న 149 సిమెంట్ రోడ్డు పనులను, రూ.40 లక్షలతో జరుగుతున్న బిటి రోడ్డు పనులను గురువారం ఎంపీడీవో కుమార్ పరిశీలించారు. పనుల నాణ్యతను 100 శాతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేయాలని, సకాలంలో పనులు పూర్తిచేసి వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. కర్లగట్ట గ్రామ పంచయతీలో తమ్మిగానిపల్లి నుండి కృషివిజ్ఞాన కేంద్రంనకు వేస్తున్న తారురోడ్డు పనిని పరిశీలించిన ఎంపీడీవో సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని స్వయంబీస్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న నూతన కళ్యాణ మండపం నిర్మాణానికి సోమలకు చెందిన కే.హరినాథ్, మల్లీశ్వరి దంపతులు రూ.10,116లను ఆలయ ధర్మకర్త బివి.సోమశేఖర్‌కు అందజేసినట్టు తెలిపారు. లింగన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పట్టణంలో నూతనంగా స్పీడ్ బ్రేకర్లు

ప్రజాశక్తి,- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని నేతాజీ రోడ్డు, ప్యాలెస్ రోడ్డు, రాధాకృష్ణ రోడ్డుల పై నూతనంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. వీటిని పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఆకతాయి యువత ద్విచక్ర వాహనాలను అతివేగంతో నడుపుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు పురప్రజలు తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. కావున ఆకతాయి యువత వేగానికి అడ్డుకట్ట వేసే ప్రయత్నంలో పట్టణంలోని ప్రధాన రహదారులపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

స్వెట్టర్లు పంపిణీ

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం సమాచారం సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు, వికలాంగులకు గురువారం స్వెట్టర్లు పంపిణీ చేశారు. కుప్పం పట్టణంలోని రోడ్డు సైడున్న వృద్ధులకు, వికలాంగులకు, నిరుపేదలకు స్వెట్లర్లు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం కుప్పం పట్టణంలో చలి తీవ్రత అధికంగా ఉందని దీంతో 20 మందికి స్వెట్టర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సొసైటీ సభ్యులు రాజువెల్, మతిన్, పటేల్ బాబు, గని, సురేష్, రవి, కలీం, లాలు, గురుస్వామి, ఫైరోస్, ఇస్మాయిల్, నూర్, వినోద్, షబ్బీర్, బాబు, అజీమ్, కరీం పాల్గొన్నారు.

తల్లా శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్



ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు ప్రముఖ సామాజిక కార్యకర్త, జర్నలిస్టు తల్లా శ్రీనివాస్‌కు డే స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ సాంస్కృతిక సేవారంగంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. గురువారం న్యూఢిల్లీ ఆంధ్ర భవన్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆడిటోరియంలో ఎన్ఐబి కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన 5వ లీడర్షిప్ కాన్ఫరెన్స్‌లో ఆయన డాక్టరేట్ అందుకున్నారు. జాతీయ స్థాయిలో సామాజిక సాంస్కృతిక సేవ, పలురంగాలలో సమాజానికి సేవలు అందించే వారికి ప్రతిష్టాత్మకంగా అందిస్తారు. బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ ఛుభావ్, సుప్రీం కోర్టు ప్రముఖ సీనియర్ న్యాయవాది డాక్టర్ జి.వరప్రసాద్ రావు చేతుల మీదగా తల్లా శ్రీనివాస్ డాక్టరేట్ అందుకున్నారు. శ్రీనివాస్‌కు పలువురు ప్రముఖులు, మేధావులు శుభాకాంక్షలు తెలిపారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల పరిధిలోని గాజంకి గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపీడీవో టి.చంద్రమౌళి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బంది హాజరు పట్టికను, పలు రికార్డులను పరిశీలించారు. అలాగే తాగునీటి ట్యాంక్‌లను పరిశీలించి వాటర్ ట్యాంక్ నిత్యం పరిశుభ్రం చేయాలన్నారు. అదే విధంగా గ్రామం ఎక్కడ తాగునీటీ ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సకాలంలో లబ్ధిదారులకు అందించాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు.

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుకు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని వెదురుకుప్పం పంచాయతీలో ప్రారంభించారు. గురువారం మండల అధ్యక్షులు కె.లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్ మురళీ టిడిపి సభ్యత్వ నమోదు చేశారు. వారి వెంట నాయకులు చంగల్రారెడ్డి, మునిచంద్రారెడ్డి, బియ్యం రవి, భాస్కర్ నాయుడు, వరప్రసాద్, చిన్నబ్బ, వెంకటాద్రి నాయుడు, కృష్ణారెడ్డి, హేమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

ప్రజాశక్తి- కుప్పం రూరల్: మాల మహానాడు సభను జయప్రదం చేయాలని మాల మహానాడు చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కందస్వామి కోరారు. ఈనెల 23న పలమనేరు పట్టణంలో జరిగే మాలమహానాడు సభను జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రికలను గురువారం విడుదల చేశారు. అనంతరం కుప్పం మండలంలోని పలు గ్రామాలలో ఆయన పర్యటించారు.

చౌడేపల్లి: ఎస్సి వర్గీకరణకి వ్యతిరేకంగా ఈనెల 23న పలమనేరులో మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహించే ధర్మయుద్ధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సంబంధిత గోడపత్రికలను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, మండల అధ్యక్షులు కొత్తపల్లి మణి, ఉపాధ్యాక్షులు శ్రీరాములు, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు

నేషనల్ హ్యూమన్ రైట్స్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ ఆంధ్రప్రదేశ్

మీడియా ఆఫీసర్‌గా శివకుమార్

ప్రజాశక్తి- పలమనేరు: నేషనల్ హ్యూమన్ రైట్స్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ మీడియా ఆఫీసర్‌గా పలమనేరు పట్టణానికి చెందిన కంగుంది శివకుమార్‌ను ఎంపిక చేస్తున్నట్లు నేషనల్ ప్రెసిడెంట్ మాదేశ్ తెలిపారు. గురువారం స్థానిక కానాల ఇండ్లు వద్ద రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించారు. మాదేశ్ మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకెళుతున్న శివకుమార్‌ను తమ సంస్థలో తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

నేడు వైసిపి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- గంగవరం: 22వ తేదీ శుక్రవారం స్థానిక వెంకటసాయి కళ్యాణ మండపంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ్ గురువారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైసిపి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి వస్తున్నారని, సమావేశానికి నియోజకవర్గంలోని వైసిపి కార్యకర్తలు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచులు హాజరు కావాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు ఈ బైక్స్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: పర్యావరణ పరిరక్షణ ఈ బైక్‌ల వాడకంతోనే సాధ్యమవుతుందని సీఐ లక్ష్మీనారాయణ, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, వెలుగు ఏపిఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. గంగాధర నెల్లూరులో కెనరా బ్యాంక్ పక్కన ఎడిఎంఎస్ ఈ బైక్స్ బుకింగ్ కార్యాలయాన్ని సీఐ, తహసిల్దార్, ఎంపీడీవో, వెలుగు ఏపిఎంలు కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఏడిఎంఎస్ ఈ బైక్‌లపై టీం లీడర్లు అధికారులు కలిసి ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు జిల్లా ఎడిఎంఎస్ ఈ బైక్స్ నెట్వర్క్ మార్కెటింగ్ టీం లీడర్ ఎం.ఎన్.రెడ్డి, షోరూం యజమాని శివకృష్ణ, జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణ నాయుడు, వెంకటేష్, శ్రీధర్ యాదవ్, దేవసుందరం, అశోక్ నాయుడు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం

ఆర్యవైశ్య సంఘం నాయకులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి రోజును ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా గుర్తించడం పట్ల రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘ సంఘముల సమైక్య మాజీ కార్యదర్శి, మాజీ కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ డైరెక్టర్ ఆర్. శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అలాగే ఆర్యవైశ్యుల కులదైవమైన కన్యకాపరమేశ్వరి జయంతిని కూడా గుర్తించడం మంచి పరిణామమన్నారు. రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి నామినేటెడ్ పాలకవర్గాన్ని నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

'వరి'పై జంట ఏనుగుల దాడి

ముగ్గురు రైతులకు పంట నష్టం



పంట నష్టాన్ని చూపుతున్న రైతు

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు చెందిన కోతకు వచ్చిన వరి పైరుపై బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో జంట ఏనుగులు దాడి చేసి పంటపై తొక్కుకుంటూ వెళ్లి తీవ్ర నష్టం కలిగించినాయని రైతులు వాపోయారు. ఇడగట్టు హరినాథ, ఇడగట్టు రెడ్డప్ప, దేరంగుల దేవేంద్ర అనే ముగ్గురు రైతులకు చెందిన వరి పైరు గట్టుపై ఉన్న కొబ్బరి చెట్లు ధ్వంసం చేసి తీవ్రనష్టం కలిగించాయని, రెండు నెలల క్రితం కూడా పాయలగుట్ట సమీపంలోని తమ పంట పొలాలపై ఏనుగుల మందదాడి చేసి టమోటా ఇతర పంటలకు తీవ్ర నష్టం కలిగించాయని, అయితే ప్రభుత్వం నుండి తమకు ఎలాంటి ఆర్థిక సాయం గాని భరోసా కానీ లేకుండా పోతుందని వాపోయారు. నిరంతరం అప్పు చేసి పంటలు పండించడం తీరా పంట చేతికొచ్చే సమయానికి ఏనుగులు దాడి చేసి పంటను ధ్వంసం చేయడం జరుగుతూ వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ఏనుగుల దాడులు జరుగుతూనే ఉన్నా అటవీ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. గురువారం ఉదయం తమ పంట పొలాల వద్దకు వెళ్లి చూడగా జరిగిన పంటనష్టం చూసి కళ్ళు చమర్చుతున్నాయని రైతులు అన్నారు. కాగా పాయలగుట్ట, నెలుకూరివారిపల్లి, బుడ్డారెడ్డిగారిపల్లి గ్రామాలు అటవీప్రాంత సరిహద్దుల వద్ద ఉండడంతో రాత్రి వేళల్లో ఏనుగులు ఎక్కడ గ్రామాలపై పడి ప్రాణనష్టం కలిగిస్తాయోనని బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. ఏనుగుల బెడద నుండి ఈ ప్రాంత ప్రజలను తప్పించాలని కోరుతున్నారు.

సారా రహిత జిల్లాగా మార్పు తీసుకొస్తాం

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ్ శేఖర్



ఎక్సైజ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ కమిషనర్

ప్రజాశక్తి- కార్వేటినగరం: చిత్తూరు జిల్లాను సారా రహిత జిల్లాగా మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ఎక్సైజ్ సిబ్బంది పనిచేస్తోందని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ తలమాల విజయ్‌శేఖర్ అన్నారు. గురువారం ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో సారా అమ్మకాలు, తయారీలు లేకుండా అరికట్టేందుకు ఎక్సై సిబ్బందిని సిద్ధం చేస్తున్నామన్నారు. బెల్టు షాపులు ఏరివేత దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గంజాయి అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచి సరిహద్దు ప్రాంతాలలో దాడులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గంజాయి విక్రయాలను ఆరికట్టేందుకు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల అధికారులతో మాట్లాడి గంజాయి అమ్మకాలపై నిఘా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాలు సేవించిన, అమ్మకాలు జరిపినట్లు తెలిసిన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసిన షాపుల లైసెన్స్‌లను రద్దు చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు చేయకుండా అటవీశాఖ అధికారులు కూడా సహకరించాలని, అనుమానం ఉన్న ప్రాంతాలను తమ ఎక్సైజ్ శాఖ దృష్టికి తీసుకొచ్చి నివారణకు సహకరించాలని కోరారు. అక్రమ సారా తయారీలపై పోలీస్ సిబ్బంది విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నాయి. అయితే ఎక్సైజ్ అధికారులు ఎక్కడ దాడులు నిర్వహించనట్లు సమాచారం లేదని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ను వివరణ కోరగా ఎక్సైజ్ శాఖలో సిబ్బంది కొరత ఉందన్నారు. కార్యక్రమంలో సిఐ శిరీషాదేవి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'గోకులం షెడ్ల'పై అవగాహన కల్పించండి: పీడీ



ప్రజాశక్తి- పెద్దపంజాణి: గోకులం షెడ్డుల నిర్మాణంలో క్షేత్రస్థాయి సిబ్బంది రైతులను సంప్రదించి షెడ్లు నిర్మాణాలపై అవగాహన కల్పించాలని డ్వామా పీడీ ఏ.రవికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని బట్టందొడ్డి, మాదనపల్లి గ్రామ పంచాయతీలలో జరుగుతున్న గోకులం షెడ్డుల నిర్మాణాలను పథక సంచాలకులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పీడీ రవికుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ రెడ్డప్ప హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో ఎలాంటి అవకతవలు పాల్పడకుండా ఉపాధి హామీ పనులు నిర్వహించాలని, గోకులం షెడ్డులను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే రైతులకు అవగాహన కల్పించాలని ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. మండలానికి 175 గోకులం షెడ్డులు మంజూరు అయ్యాయని, అయితే 70 మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయని, ఇంకా ప్రారంభం కాని వాటిని వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో బాలాజీ, ఉపాధి హామీ ఏపీఓ మురుగేషన్, ఇంజనీరింగ్ విభాగం అధికారి నాగమణి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ అండ్ మ్యాథ్స్ ఫెయిర్



ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోని శ్రీశ్రీ పరమహంస యోగానంద విద్యాలయ పాఠశాలలో గురువారం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, కుప్పం ఆధ్వర్యంలో సైన్స్ అండ్ మ్యాథ్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్ మాట్లాడుతూ గణితం, సామాన్య శాస్త్రాల ఆవశ్యకత ప్రస్తుత సమాజంలో ఎంత అవసరం ఉందో విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో భాగంగా అనేకమంది విద్యార్థులు తాము రూపొందించిన పరికరాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. సైన్స్ అండ్ మ్యాథ్స్ ఫెయిర్‌లో ఉంచి మోడల్స్‌ని సందర్శించడానికి వచ్చిన విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వాటి గురించి చక్కగా వివరించారు. అనంతరం ఉత్తమ ప్రయోగాన్ని ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ గణితశాస్త్ర హెడ్ డాక్టర్ ఉదయ్ కుమార్, ఇగ్నేటర్ ఆర్.అనిత, విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ పార్థువులు, సైన్స్ టీచర్స్ అక్షత, నారాయణరెడ్డి, సంపత్, సుమ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

సైనిక్ బోర్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ రాఘవులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని ఎన్జీవో హోంలో గురువారం కుప్పం నియోజకవర్గ మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవిచంద్ర ఆధ్వర్యంలో మాజీ సైనిక ఉద్యోగుల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సైనిక్ బోర్డ్ చిత్తూరు జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ రాఘవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనిక ఉద్యోగులకు పాత గుర్తింపు కార్డులను పరిశీలించడంతోపాటు కొత్త గుర్తింపు కార్డులను మంజూరు చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. అలాగే మాజీ సైనిక ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారులకు అర్జీల రూపంలో తెలియజేశారని, వీటన్నింటినీ పరిశీలించిన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సైనిక్ బోర్డు సూపరింటెండెంట్ మహమ్మద్ రజాక్, జూనియర్ అసిస్టెంట్ సాయి, వినాయక రెడ్డి, కుప్పం నియోజకవర్గ మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవా పాల్గొన్నారు.

పోషణపై అవగాహన



ప్రజాశక్తి- పలమనేరు: ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గురువారం పట్టణ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి.రమణారెడ్డి గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించడంతోపాటు పోషకారాహారాన్ని అందించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనివాలని తెలపారు. అలాగే స్వనిధి లబ్ధిదారులు, వీధి విక్రయదారులకు ఆర్థిక స్వాలంబనలో భాగంగా మొదట విడతగా రూ.10వేలు తక్కువ వడ్డీతో బ్యాంకు రుణం మంజూరు చేయడం జరుగుతుందని, రెండో విడత రూ.20వేలు, మూడో విడతగా రూ.50వేలు రుణం 8శాథం వడ్డీతో తీసుకోవచ్చు అని తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నజ్మా, మెప్మా సిఎంఎం వి.బాబు, సీవో జయంతి, ధనలక్ష్మీ, ఆర్‌పిలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కిడ్నాప్‌కు పాల్పడిన ఏడుగురు అరెస్ట్



ప్రజాశక్తి- కుప్పంటౌన్: రామకుప్పం మండలంలో ఇటీవల గోవిందప్ప కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేయడంపై నమోదైన కేసును కుప్పం పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి ఇంచార్జి డీఎస్పీ ప్రభాకర్ పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బృందాలుగా ఏర్పడి కిడ్నాప్ కేసును ఛేధించారని తెలిపారు. కిడ్నాప్‌కు పాల్పడిన ఏడుగురిని అరెస్ట్ చేశామన్నారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నట్టు తెలిపారు. కిడ్నాప్‌కు వినియోగించిన 3 కార్లను సీజ్ చేయడం జరిగిందన్నారు. రైస్ పుల్లింగ్‌లో రూ.100 కోట్లు గోవిందప్ప కుటుంబ సభ్యులకు వచ్చాయనే గోవిందప్ప కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేశామని పోలీసుల విచారణలో నిందితులు ఒప్పుకున్నారని తెలిపారు. కాగా రైస్ పుల్లింగ్ అనే విషయం అపోహ మాత్రమేనని, త్వరలోనే పరారీలో ఉన్న ఐదుగురిని అరెస్ట్ చేస్తామన్నారు. నిందితులపై కడప జిల్లా సందేపల్లి పోలీస్ స్టేషన్‌లో కూడా కేసులున్నాయని ఆయన తెలిపారు. రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్ - లక్ష జరిమానా

ప్రజాశక్తి- విజయపురం:



ఇసుక టిప్పర్ సీజ్ చేసి రూ. లక్ష జరిమానా విధించిన సంఘటన మండల కేంద్రమైన విజయపురంలో గురువారం చోటుచేసుకుంది. మండలంలోని నుండి తమిళనాడుకు చెందిన టిప్పర్ వాహనంలో తమిళనాడుకు చెందిన వ్యక్తి అక్రమంగా తమిళనాడుకు ఇసుకను తరలిస్తుండగా ఉదయం 4 గంటల ప్రాంతంలో ఎస్ఐ బలరాం పన్నూరు సబ్‌స్టేషన్ నాలుగు కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేయడంతో రికార్డులు సక్రమంగా లేకపోవడంతో అక్రమంగా ఇసుక తరలిసుతన్న టిప్పర్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్ మాట్లాడుతే అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తుంటే ఇలా అక్రమ రవాణా చేయడం చట్టరీ –త్యా నేరమన్నారు. టిప్పన్‌ను సీజ్ చేయడంతో పాటు లక్ష రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలింపు కొనసాగితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

ఆటో బోల్తా - ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- చౌడేపల్లి: ఆటో బోల్తా పడి ముగ్గురు గాయాలపాలైన సంఘటన గురువారం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. చౌడేపల్లి, చుక్కావారిపల్లి ప్రధాన రహదారిలో చౌడేపల్లి వైపువస్తున్న ఆటో బాలసముద్రంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చుక్కావారిపల్లికి చెందిన గంగులమ్మ, నీలమ్మ, వసంతమ్మలకు గాయాలయ్యాయి. గాయపడ్డవారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వారిలో నీలమ్మ, గంగులమ్మ పరిస్థితి విషమించడంతో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - రొంపిచెర్ల:



రొంపిచెర్ల క్రాస్ –తిరుపతి ప్రధాన రోడ్డు మార్గంలో రొంపిచర్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి.సుబ్బారెడ్డి, పోలీస్ సిబ్బందితో గురువారం వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రికార్డులు లేని వాహన యజమానులపైన, బెల్టు పెట్టుకోకుండా కార్లు నడుపుతున్న డ్రైవర్ల పైన, హెల్మెట్లు లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారి నుంచి అపరాధ రుసుము వసూళు చేసినట్లు తెలిపారు. అనంతరం వాహనదారులకు రోడ్డ నియమాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఏఎస్ఐ మధు, పిసిలు రెడ్డెప్ప రెడ్డి, వేణు, శోభన్ బాబు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో

విత్తనాలు నాటిన విద్యార్థులు

ప్రజాశక్తి -సదుం: స్థానిక మణికంఠ లయన్స్ క్లబ్ సహకారంతో సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి, ఎన్‌జిసి విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.జయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో చెరుకువారిపల్లి అటవీ ప్రాంతంలో సీతాఫలం, వేప, కుంకుడు, గుల్ మెహర్ విత్తనాలు, ఇతర మొక్కల సీడ్ బాల్స్‌ను గురువారం అటవీ ప్రాంతంలో నాటారు. పర్యావరణ పరిరక్షణ, విత్తనాలు, నాటడం, అడవుల రక్షణ – ఆవశ్యకతపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నరసింహులు, డాక్టర్ కె.రాజారెడ్డి, మనోజ్ కుమార్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు రవీంద్రబాబు, ఆంజనేయులు, జిలాని బాష, విశ్వనాథ్, ఎన్‌జిసి కో ఆర్డినేటర్లు యుగంధర్, అమరనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

BEFORE THE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISION-1, CHITTOOR,A.P
C.C.No. 36 of 2024

Between:
Ulli Arun Kumar,
S/o Ulli Munirathnam,
R/at No.4-69-1,Showkaru Street,
Sadum Town & Mandal,Chittoor District
...Complainant
And
Movva Fin Corp(Arunodaya Financiers)
Rep by its Authorised Signatory,
having branch office at D.No.19-3-11/A1,Ground Floor, Opp.Bliss Hotel,
Renigunta Road, Tirupati-5175001
...Opposite Party 1

NOTICE TO OPPOSITE PARTY-1

Sir, Please take notice that the above Complainant filed above C.C.No.36 of 2024 against you and same is posted for your appearance on **09.12.2024**. Hence you are directed to appear before the above court on **09.12.2024 at 10-30 A.M** by in person or through your advocate and file your objections if any.Otherwise the next steps follows according to the law.

Sd/-A.DEVENDRANATH,B.Sc.B.L.,
Advocate for Petitioner/Complainant
Place:Chittoor, Date: 21-11-2024

IN THE COURT OF ADDL.CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR
I.P.No.15 of 2022

Between:
D.Raja ...Petitioner
And:
Balakrishna Rao & others ... Respondents

NOTICE TO 1st RESPONDENT

To:
R-1)Balakrishna Rao, S/o not known
Business premises in Shop No.66,
Municipal Complex,
Chittoor Town & District.
Sir,
Please take notice that the above named petitioner filed the above Insolvency Petition as against you and others to declare him as Insolvent and the above I.P. is posted to **20-12-2024** for your appearance before the said court. Please be present either in person or through an advocate on the said date at about **10-30 A.M**. and to raise your objections if any, failing which the matter will be decided as exparte in your absence.

Sd/- xxxxx
Sri KANIPAKAM SURESH,
Counsel for Petitioner
Place: Chittoor Date: 21-11-2024